క్లుప్తంగా

హుండీ రాబడి రూ.36 లక్షలు



దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయ హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను ఉన్నత అధికారుల పర్యవేక్షణలో సోమవారం ఆలయం ప్రాంగణంలో లెక్కించినట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. గడిచిన 77 రోజుల్లో భక్తులు అమ్మవారి ఆలయ హుండీలో వేసిన కానుకలను లెక్కించినట్లు చెప్పారు. రూ. 36,11,529 రాబడి వచ్చినట్లు వెల్లడించారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్షన్ అధికారులు, కారంపూడి గ్రూప్ టెంపుల్స్ ఈఓ కృష్ణంరాజు పర్యవేక్షించారు. సంబంధిత నగదును ఆలయానికి సంబంధించిన బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



దాచేపల్లి: హత్యకు గురైన నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. రూ.15వేల నగదును చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అందించారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని చైర్మన్ భరోసానిచ్చారు. కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఆర్ఐ ప్రసాద్, నగర పంచాయతీ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలు



దుర్గి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నిర్మల ద్విచక్ర వాహనం నుంచి పడటంతో తీవ్రంగా గాయపడింది. సోమవారం విధులు ముగించుకొని మాచర్ల వెళ్తున్న క్రమంలో పెట్రోల్ బంకు సమీపంలో ఆమె ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను హుటాహుటిన 108 వాహనంలో మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీకాంత్‌పై సోమవారం రాత్రి దాడి జరిగింది. శ్రీకాంత్ మాచర్ల రోడ్డులోని రెస్టారెంట్‌లో ఉన్న సమయంలో నలుగురు వ్యక్తులు దాడిచేసి గాయపర్చారు. మధ్యాహ్నం స్థానిక అంకాలమ్మ గుడి సెంటర్‌లో శ్రీకాంత్‌కు టీడీపీ నాయకుడు గోరంట్ల నాగేశ్వరరావుకు మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో నాగేశ్వరరావు గాయపడ్డాడు. ఈ క్రమంలో రాత్రి శ్రీకాంత్ స్థానిక మాచర్ల రోడ్డులోని రెస్టారెంట్‌లో ఆయనపై దాడి జరిగింది. మధ్యాహ్నం జరిగిన ఘటనకు ప్రతీకారంగా నాగేశ్వరరావుకు మద్దతుగా టీడీపీ నాయకులు నలుగురు శ్రీకాంత్‌పై దాడి చేసి గాయపర్చారని తెలుస్తోంది. గాయపడిన శ్రీకాంత్‌ను గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసులు నమోదు చేసిన కారెంపూడి సీఐ జయకుమార్, విచారణ చేస్తున్నారు.

గొరిజవోలులో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం

నాదెండ్ల: గొరిజవోలు గ్రామంలోని బొడ్డురాయి (నాభిశిల) గొడరాళ్లు, పురాతన ఆలయాలైన అంకమ్మగుడి, పోలేరమ్మ గుడి, పోతురాజు విగ్రహాలకు సోమవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1951లో నిర్మించిన ఈ ఆలయాలు ప్రస్తుతం రోడ్డుకన్నా దిగువకు పోయాయి. శిథిలావస్థకు చేరిన ఆలయాలు, లోతట్టుకు చేరిన బొడ్డురాయి జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఫిరంగిపురానికి చెందిన నారాయణం ప్రసాదంచార్యులు, పర్చూరి మాధవస్వామి, రత్నాకరం రాఘవశాస్త్రి బృందం బొడ్డురాయి వద్ద శిథిలావస్థకు చేరిన ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొందరు దంపతులు పీటలపై కూర్చుని సంప్రదాయబద్ధ మేళతాళాలతో గోమాత సహకారంతో పనులు ప్రారంభించారు. బొడ్డురాయి, గొడరాళ్లతో పాటూ అంకమ్మగుడి, పోలేరమ్మగుడి, పోతురాజు విగ్రహాలను తొలగించి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా భద్రపరిచారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైన పూజా కార్యక్రమాలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి.పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు.

నగదు బదిలీ పథకంతో రైతులకు మేలు

ఏపీ ట్రాన్స్‌కో డీఈ హరిబాబు



మాట్లాడుతున్న డీఈ హరిబాబు, ఏఈ మస్తాన్‌వలి

రెంటచింతల: వైఎస్సార్ వ్యవసాయ నగదు బదిలీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో డీఈ జె.హరిబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఏజీఎల్ కనెక్షన్‌లు ఉన్న రైతులందరూ తమ బ్యాంక్ ఖాతాను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్ సదుపాయానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఉచిత విద్యుత్ వల్ల రైతులకు ఇస్తున్న రాయితీ మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమచేయడం జరుగుతుందన్నారు. దీంతో రైతులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఎంత నగదు రాయితీగా ఇస్తుందో తెలుస్తుందన్నారు. రైతులు వారి బ్యాంక్ ఖాతాలకు ఏజీఎల్ కనెక్షన్ సర్వీస్ నంబర్‌తో లింక్ చేయకపోతే రాయితీ రాదని, కొంత కాలానికి వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం కూడా తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కొందరు సృష్టిస్తున్న అపోహలను, చేస్తున్న ప్రచారాలను నమ్మొద్దని, మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ఏలాంటి నష్టం జరగదన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 3,131 ఏజీఎల్ కనెక్షన్‌లు ఉన్నాయని ఇప్పటి వరకు 2,959 కనెక్షన్‌లకు మీటర్లు ఏర్పాటు చేసి లింక్‌అప్ చేశామని తెలిపారు. మిగిలిన 172 మంది రైతులు మాత్రమే అనుసంధానం చేసుకోవాల్సి ఉందన్నారు. రైతులు ప్రతి నెలా సర్వీస్ చార్జి కింద రూ.30 చెల్లించాలన్నారు. ఈ సర్వీస్ చార్జీల బకాయిలు ఇప్పటి వరకు రూ.40 లక్షలున్నాయని వెల్లడించారు. గ్రామాలలో రైతులకు ఇప్పటికే ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో, పంటపొలాల్లో విద్యుత్ తీగలు కిందగా ఉంటే.. వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే.. తీగలను ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల బకాయిలు రూ.6.65 కోట్లు, ఇళ్ల సర్వీసు కనెక్షన్‌ల బకాయిలు రూ.74 లక్షలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.1.84 లక్షలు వరకు ఉన్నాయని తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో నియమ నిబంధనలను పాటించకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఈ షేక్ మస్తాన్‌వలి, ఎల్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు, నగర పంచాయతీ అధికారులు పాల్గొనాలని, పలు అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు.

నేడు మాచర్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశం

వెల్దుర్తి: మాచర్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 10గంటలకు సభ్యులు హాజరు కావాలన్నారు. పలు అంశాలపై చర్చిస్తామని, కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

నరసరావుపేట రూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరోకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని ములకలూరులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ములకలూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజా (33) డ్రైవర్‌గా పనిచేస్తున్నా డు. ఆదివారం సాయంత్రం తన బంధువైన షేక్ మాబూవలితో కలిసి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వచ్చారు. ఇంటికి వెళ్లే క్రమంలో ములకలూరు గ్రామంలోని మెయిన్‌రోడ్డుపై చర్చి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ ఖాజా అక్కడికక్కడే మృతి చెందాడు. మాబూవలికి తీవ్రగాయాలు కావడంతో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఖాజాకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరాల్సిన ఖాజా విగతజీవిగా రోడ్డు మీద పడి ఉండటాన్ని చూసి భార్య, కుమార్తెలు, బంధువులు కన్నీరుమున్నీరై విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు గాయాలు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్‌కు తీవ్ర గాయాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సత్తెనపల్లిలోని గండ్లూరు గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ గీత అలియాస్ గోపి ఆరు నెలలుగా గణపవరంలోని రాజీవ్‌గాంధీకాలనీలో నివాసం ఉంటోంది. ఈ నెల 25న రాత్రి 9 గంటల సమయంలో చిలకలూరిపేట నుంచి ఆటోలో వచ్చి రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద జాతీయ రహదారిని దాటే క్రమంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. తీవ్రగాయాలైన గీతను అప్పట్లో 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు నోటిఫికేషన్

వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ ప్రాజెక్టు వినుకొండ కార్యాలయం పరిధిలో గల నూజెండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ సహాయకురాలు ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అనురాధ సోమవారం తెలిపారు. నూజెండ్ల మండలంలోని మార్లెవారి పాలెం 1 (బీసీ-డీ), పాత చెరుకుంపాలెం (జనరల్), పువ్వాడ 2 (బీసీ-బీ) ఖాళీలు ఉన్నట్లు ఆమె వివరించారు. అర్హులైన అభ్యర్థులు అర్హత కలిగిన పత్రాలతో పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 2వ తేదీ లోపు వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జాతీయ రహదారి సర్వే సమగ్రంగా నిర్వహించండి

గురజాల ఆర్డీఓ అందెయ్య



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ అందెయ్య

పిడుగురాళ్ల: పేరేచర్ల - కొండమోడు జాతీయ రహదారి భూ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని గురజాల ఆర్డీఓ అందెయ్య ఆదేశించారు. పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డు సమీపంలో హైవే సర్వే పనులను ఆర్డీఓ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వేను పూర్తిస్థాయిలో చేపట్టాలని, పట్టాభూమి ఎంత అవసరమో గుర్తించాలని సర్వే బృందానికి స్పష్టం చేశారు. ప్రభుత్వభూమి రోడ్డు నిర్మాణానికి ఎంత అవసరమవుతుందో గుర్తించాలన్నారు. హైవే నిర్మాణంతో గుంటూరు వెళ్లే వాహనాలు పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు తీరడమే కాకుండా బైపాస్ ద్వారా వెళ్ల వచ్చన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు, సర్వే బృందానికి పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, గురజాల సర్వేయర్ జయరాజు, పిడుగురాళ్ల సర్వేయర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్ఐ సత్యారెడ్డి, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త శివప్రసాద్

ఇస్రో శాస్త్రవేత్త వై.శివప్రసాద్

నరసరావుపేట రూరల్: నూతన ఆవిష్కరణలపై యువత దృష్టి సారించాలని ఇస్రో శాస్త్రవేత్త వై.శివప్రసాద్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలను చిల్డ్రన్స్ సైన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇస్రో శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ నోబెల్ బహుమతి సాధించడం ద్వారా దేశంలో సైన్స్ రంగంలో సీవీ రామన్ విశేష మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. దేశ అంతరిక్ష పరిశోధన రంగంలో అగ్రగామిగా నిలవడానికి విక్రమ్‌సారా భాయ్, అబ్దుల్ కలాం చేసిన కృషిని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని యువత పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో రాణించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ, చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఫౌండర్ డాక్టర్ శాంతమూర్తి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ సలహాదారుడు డాక్టర్ అన్నవరపు కుమార్
- కృష్ణవేణిలో అవగాహన సదస్సు



విదేశీ విద్యపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అన్నవరపు కుమార్

నరసరావుపేట ఈస్ట్: విదేశాలలో ఉన్నత చదువుల పట్ల ఆసక్తి గల విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ సలహాదారుడు డాక్టర్ అన్నవరపు కుమార్ తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో సోమవారం విదేశీ విద్య-అవకాశాలు అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం విదేశీవిద్య కోసం అందించే ప్రోత్సాహకాలు, విద్యార్థులకు గల అవకాశాలను వివరించారు. అలాగే విదేశాలలో గల ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, కంప్యూటర్ విభాగాధిపతి టి.సురేఖ, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి షేక్.సర్దార్, డాక్టర్ యోగేశ్వరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతులు ప్రదానంచేస్తున్న అసోసియేషన్

నరసరావుపేట ఈస్ట్: సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల క్రీడా ప్రాంగణంలో నరసరావుపేట టెన్నిస్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల నరసారెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాలలో 65 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారని తెలిపారు. అండర్-12 విభాగంలో వై.నీరజ్‌రెడ్డి ప్రథమ, ఎస్.శశిప్రియ ద్వితీయ స్థానాలు సాధించారు. అలాగే పురుషుల డబుల్స్‌లో శేషు, చిన్న (నరసరావుపేట) ప్రథమ, మణి, జగదీష్ (కావలి), 45 సంవత్సరాలు విభాగంలో ప్రసా ద్, వంశీ (కావలి), నరసారెడ్డి, వెంకట్ (నరసరావుపేట), 55 సంవత్సరాల విభాగంలో పాండు, రామకృష్ణారెడ్డి (ఒంగోలు), డాక్టర్ జి.వి.మోహన్ రెడ్డి, శివారెడ్డి (గిద్దలూరు), 65 సంవత్సరాల విభాగంలో కె.మోహనరెడ్డి, డాక్టర్ రత్తయ్య(కనిగిరి), ఎం.ఎస్.ప్రసాదు, శశిభూషణ్ (నరసరావుపేట) ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మిరియాల ప్రసాదు, టోర్నమెంట్ ఇన్‌చార్జ్ క్రోసూరి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బొల్లాపల్లి: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలు, సైన్స్ ద్వారా మన సమస్యల పరిష్కారం గురించి వ్యాసరచన పోటీలు, ప్రముఖ భారతీయ శాస్త్రవేత్తల గురించి వక్తృత్వ పోటీలు, సైన్స్ క్విజ్ పోటీల్లో ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచంలో అత్యున్నతమైనటువంటి నోబెల్ బహుమతి సర్ సీవీ రామన్‌కు ప్రకటించిన రోజు ఫిబ్రవరి 28 కావడంతో జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నామని ఈ మేరకు జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.చలపతిరావు తెలిపారు. ఆయా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన ఆర్. స్వరూపాబాయి, పి. సునీల్‌రెడ్డి, సీ.హెచ్. భవాని, భద్రకాళీశ్వరి, ఎస్.మహేశ్వరి, పలువురు విద్యార్థులకు బహుమతులు అందజే శారు. ఉపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, షేక్ షిరాజున్నీసా, వి.నాగమణి, వరప్రసాద్ పాల్గొన్నారు.

చూడకుంటే.. ఖాతా ఖాళీ

పది రోజుల్లో ఐదుగురి బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం

కారెంపూడి: తరచూ బ్యాంకు ఖాతాదారులు తమ ఖాతాలోని నగదును చూసుకుంటూ ఉండండి. మీరు దాచుకున్న నగదు మొత్తం ఉండకపోవచ్చు. లేదా..పూర్తిగా ఖాళీ అవ్వొచ్చు. సైబర్ నేరగాళ్ల పనో... మరేయితర కారణాలో తెలియదు కానీ, కారెంపూడిలో గడచిన పది రోజుల్లో ఎనిమిది మంది ఖాతాదారులు తమ నగదు పోగొట్టుకుని లబోదిబోమన్నారు. వీరందరూ స్థానిక యూనియన్ బ్యాంకు ఖాతాదారులే. తమ ఖాతా నుంచి నగదు మాయం అయిన విషయం బ్యాంకుకు వచ్చే వరకు వారికీ తెలియదు. నగదు డ్రా చేసేందుకు బ్యాలెన్స్ చూడగా.. ఖంగు తిన్నారు. ఒప్పిచర్లకు చెందిన ఓ రైతు నవంబరులో సదరు బ్యాంకు ఖాతాలో రూ.70 వేల నగదు దాచుకున్నాడు. ఇటీవల బ్యాంకుకు వచ్చి డ్రా చేసుకోవాలని యత్నిస్తే తన ఖాతాలో రూ.29 వేలు మాత్రమే ఉన్నాయని బ్యాంకు అధికారులు తెలపడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. తనకు తెలియకుండా నగదు మాయం కావడంతో బ్యాంకు అధికారులను నిలదీశాడు. మిగతా నలుగురి ఖాతాదారుల పరిస్థితి కూడా ఇలాంటిదే. ఇది సైబర్ నేరగాళ్ల పని అని అధికారులు వారికి వివరించలేక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో తమ నగదుపై మిగతా బ్యాంకు ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. స్థానిక యూనియన్ బ్యాంకులో ఇప్పటి వరకు ఐదు ఖాతాల నుంచి సుమారు రూ.70 వేల దాకా నగదు మాయం అయినట్లు సమాచారం. ఈ విషయమై బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఎ.భాస్కరరావు వివరణిస్తూ.. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను హ్యాక్ చేస్తూ నగదును అపహరిస్తున్న మాట నిజమేనన్నారు. దీనికి తమ ఖాతాదారులను అప్రమత్తం చేస్తూ.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సందేశాలు పంపుతున్నామన్నారు. తమ ఆధార్ నంబరును లాక్ చేసుకోవడం ద్వారా ఈ సైబర్ దోపిడీని అడ్డుకోవచ్చని సూచించారు. ఇది ఇలా.. ఉంటే ఏఈపీఎస్ ద్వారా సైబర్ నేరస్తులు తమకు లభ్యమైన ఖాతారుల ఆధార్ నంబర్, వేలి ముద్రల ఆధారంగా బ్యాంకు ఖాతాల నుంచి నగదును మాయం చేస్తున్నారని, ముఖ్యంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల వెబ్‌సైట్‌లను హ్యాక్ చేస్తున్నారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉన్న ఇతర సంస్థల నుంచి కూడా డేటా చోరీ అవుతున్నట్లు చెప్తున్నారు. దీనికి ఆధార్ నంబరును లాక్ చేసుకోవడమే ప్రస్తుతం ఉన్న మార్గమంటున్నారు. ఇక ఆధార్‌తో సెలఫోన్ నంబరు లింకు కాని నిరక్షరాస్యుల పరిస్థితి ఏమిటనేదే ఆందోళన కలిగించే విషయం.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు



వట్టెపు నాగేశ్వరరావు



రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దాచేపల్లి: యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శిగా స్థానిక ఏలియంపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వట్టెపు నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసరావుపేటలో జరిగిన యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. జిల్లా కార్యదర్శిగా మూడవసారి ఎన్నికైన తాను ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. యూటీఎఫ్ నాయకులు షేక్ మస్తాన్‌వలి, తగరం ఆనంద్‌కుమార్, పప్పుల సత్యనందరావు తదితరులు ఆయనను అభినందించారు.

రాజ్‌కుమార్‌కు సన్మానం

రెంటచింతల: యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యునిగా వీజీవీ రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు సీనియర్ నాయకులు వెన్నా బిచ్చిరెడ్డి తెలిపారు. సోమవారం నరసరావుపేటలో నిర్వహించిన పల్నాడు జిల్లా యూటీఎఫ్ మహా సభలో నూతన జిల్లా ఆడిట్ కమిటీని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రెంటచింతలలోని ఆ శాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులు రాజ్‌కుమార్‌ను సన్మానించి, అభినందించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ అన్వరుల్లా, నాయకులు గుజ్జుల లింగారెడ్డి, జి.రామాచారి, బిల్లా ప్రతాప్, రాజశేఖర్, రమేష్, సురేష్, ఆంజనేయులు నాయక్, ఓర్సు సాగర్‌బాబు తదితరులున్నారు.

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తే.. చూస్తూ ఊరుకోం..



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి, నాయకులు

మాచర్ల మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి

వెల్దుర్తి: ప్రశాంతంగా ఉన్న మాచర్ల నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించి గొడవలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచర్ల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి గ్రామాల్లో కార్యకర్తలను రెచ్చగొట్టి గొడవలు సృష్టించి, పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. 15 ఏళ్లుగా ఎలాంటి గొడవలు లేని మాచర్ల నియోజకవర్గంలో ఆయన ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న తర్వాత కార్యకర్తలను రెచ్చగొట్టి..గొడవలు సృష్టించి.. ఆ బురదను వైఎస్సార్‌సీపీపై చల్లుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుటుంబానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్చుకోలేక చంద్రబాబు డైరెక్షన్‌లో ఫ్యాక్షన్ రాజకీయాలు చేయటానికే వచ్చారా.. అంటూ ప్రశ్నించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ మాట్లాడుతూ పిన్నెల్లి కుటుంబం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తుంటే చంద్రబాబు దగ్గర డబ్బులు తెచ్చుకొని పెయిడ్ ఆర్టిస్టుగా పనిచేస్తున్న వారాలబ్బాయి జూలకంటి బ్రహ్మారెడ్డి అని విమర్శించారు. పిన్నెల్లి కుటుంబం చేతిలో రెండు సార్లు దారుణంగా ఓడిపోయారని, 2024 ఎన్నికల్లో డిపాజిట్లు కూడా తెచ్చుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల ఏఎంసీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాచర్ల జడ్పీటీసీ మల్లుస్వామి, ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, లిడ్ క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ బూదాల మరియమ్మ, బ్యూటీషియన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

రొంపిచర్ల: 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్ మాట్లాడుతూ ఈ ఏడాది జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. పదవ తర గతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఇళ్ల వద్ద ప్రశాంత వాతావరణం కల్పించి చదువుకునే విధంగా చేయాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ వివరాలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాలలో ఇటీవల జరిగిన పరీక్షలలో పదవ తరగతి విద్యార్థులకు వచ్చిన మార్కులను సబ్జెక్టుల వారీగా తల్లిదండ్రులకు వివరించారు.

సత్తాచాటండి

నాదెండ్ల: రానున్న పదో తరగతి పరీక్షల్లో సత్తాచాటి ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. పల్నాడు జిల్లాలో తమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పాఠశాలను మొదటి స్థానంలో నిలపాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా, ఏకాగ్రతతో పరీక్షలకు సన్నద్ధమవ్వాలన్నారు. విద్యార్థులు పోటీతత్వంతో మంచి ఫలితాలు సాధించాలన్నారు. పది పూర్తయిన విద్యార్థులు తమ గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్‌తో పాటూ వృత్తివిద్యా కోర్సులు చదవొచ్చన్నారు. పదో తరగతి మైలురాయిలో మంచి ఫలితాలతో మెరుగైన ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలన్నారు. హెచ్ఎం సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయవచ్చు

శావల్యాపురం: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్సు ప్రదర్శన దోహదపడుతుందని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. సోమవారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవ ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు జాన్‌సైదులు మాట్లాడుతూ సైన్సు పితామహుడైన సి.వి.రామన్ కనుగొన్న సంఘటనకు గుర్తుగా జాతీయ సైన్సు దినోత్సవం జరుపుకోవటం మంచి శుభాపరిణామమన్నారు. విద్యార్థులు తమ ఆలోచనా శక్తికి పెంపొందించుకోవటంతో పాటు జీవితాలలో ఉన్నత స్థానాలకు చేరుతారన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శన చాయాచిత్రాలను తిలకించి అందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పేరమీనా సీతారామయ్య, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్‌చంద్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి రవి, పోట్లూరు ఏడుకొండలు, ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి,అజిత్‌చంద్, ఉపాధ్యాయులు ఉన్నారు.